క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు


సూర్యదేవుని వ్రతాలు చేసుకుంటున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి వ్రతాలు చేసుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించింది.

హంస వాహన అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

బిక్కవోలు: బిక్కవోలులో కొలువై ఉన్న లక్ష్మీనారాయణ స్వామికి శనివారం హంస వాహన అలంకరణ చేశారు. శనివారం ఉదయం ఆలయం వద్ద ముందుగా గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

జి.మామిడాడలో ఆరాధన మహోత్సవం

పెదపూడి: జి.మామిడాడలోని జైజై నారాయణ ఆశ్రమంలో స్వామివారి 71వ ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో శివునికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం రథంపై గ్రామ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సీతారాములు, గురు నారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం


గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పండితులు తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధనుర్మాసం సందర్భంగా గ్రామంలోని శ్రీరామగిరి కొండపై వేంచేసిన కోదండరామ సహిత రమాసత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుగుపై మమకారం పెంచుకోవాలి

సీటీఆర్‌ఐ: తెలుగు భాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి అన్నారు. కళాగౌతమి ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో ఆదివారం జరిగే రచయితల సమితి సమావేశంలో భాగంగా ఆదివారం ప్రకాశం నగర్ రౌండు పార్కు దగ్గర గల ధర్మంచర కమ్యూనిటీ హాలులో సంక్రాంతి కవితలతో సమావేశం నిర్వహించారు. అనంతరం కవులు సంక్రాంతి కవితలు, కథలు, పాటలను వినిపించారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

సీతానగరం: జనసేన పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడా గురుదత్త ప్రసాద్ ఆధ్వర్యంలో సీతానగరంలో ఆ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ , జిల్లా మహిళా కార్యదర్శి గంటా స్వరూపరాణి, పార్టీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మైరెడ్డి గంగాధర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కె.విజయ్‌శంకర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదుళ్లపల్లిలో బత్తుల పాదయాత్ర

జనసేన రాజానగరం నియోజకవర్గ నాయకుడు బత్తుల బలరామకృష్ణ జనం కోసం జనసేన మహా పాదయాత్రను ఆదివారం మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలో ప్రారంభించారు. పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలను ఆయన తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, కొండేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో డిజిటల్ ఒరవడి

- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- నియోజకవర్గంలో 2,441 మంది విద్యార్థులకు లబ్ధి


ప్రభుత్వమిచ్చిన ట్యాబ్‌ల్లో పాఠాలు చదువుకుంటున్న విద్యార్థులు

బిక్కవోలు: నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు. పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించి చదివిస్తే చాలు వారి ఖాతాకు అమ్మ ఒడి సొమ్ములు వచ్చి చేరుతున్నాయి. విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన సకల మెటీరియల్ ఉండేలా జగనన్న విద్యా కానుక అందజేస్తున్నారు. ఇవే కాదు.. జగనన్న గోరుముద్దతో ప్రతి ప్రభుత్వ బడిలో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు సర్కారు బడుల్లో డిజిటల్ విద్యను దగ్గర చేసేందుకు 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్‌ల్ని అందజేశారు. ప్రభుత్వం విద్యకు ఎంత ప్రాధాన్యమిస్తుందో తెలియజెప్పడానికి ఇంతకంటే నిదర్శనమేముంటుంది..!

కార్పొరేట్ బడులకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలను తయారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంట్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల్ని అందజేశారు. ఒక్క అనపర్తి నియోజకవర్గంలోనే 2,441 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల్ని పంపిణీ చేశారు. పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య సులభంగా అర్థమయ్యేలా, ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వం ట్యాబ్‌ల్ని అందజేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమంపై విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాబ్‌ల్లో పాఠాలు ఇలా

విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబ్‌ల్లో బైజూస్ ప్రీమియం యాప్ ద్వారా 8, 9 తరగతులకు సంబధించిన ఈ–కంటెంట్‌ను అమల్లోకి తెస్తున్నారు. పాఠ్యపుస్తకాల్లో అధ్యాయాల వారీగా కంటెంట్ ఇండెక్స్‌ను పొందుపరుస్తున్నారు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, చరిత్ర, భూగర్భ శాస్త్రం పాఠాలను బోధించేలా అవకాశం కల్పిస్తున్నారు. ప్రతి అధ్యాయం కాన్సెప్ట్‌లుగా విభజించి, ప్రతి కాన్సెప్ట్‌ను దాదాపు 2 నిమిషాల నుంచి 4 నిమిషాల వ్యవధితో వీడియోలుగా పొందుపరిచారు. 300 వీడియోలతో మొత్తం 57 అధ్యాయాలు, 472 కాన్సెప్ట్‌లను రూపొందించారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన 168 ప్రశ్నాపత్రాలను అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల బడిలో నేర్చుకున్న పాఠాలు ఇంటి వద్ద పునశ్చరణ చేయడానికి అవకాశం కలుగుతుంది. ఆయా పాఠాల్లో ఉపయోగించిన చిత్రాలు, వీడియోలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమవుతాయి. ఒక్కసారి పాఠాలను అప్‌లోడ్ చేస్తే విద్యార్థులు ఆఫ్‌లైన్‌లోనే చదువుకోవొచ్చు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేకపోయినా చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

అనపర్తి నియోజకవర్గంలో లబ్ధి పొందిన విద్యార్థులు

మండలం	ఎనిమిదో తరగతి విద్యార్థులు
అనపర్తి	622
బిక్కవోలు	579
రంగంపేట	657
పెదపూడి	543
మొత్తం	2,441

సీఎంకు రుణపడి ఉంటాం



గతంలో ప్రభుత్వ పాఠశాలల్ని ఎవరూ పట్టించుకోలేదు. పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వడం వల్ల ఇంటి వద్ద సైతం పాఠాలు నేర్చుకోవడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వ పాఠశాలల పిల్లల ఉన్నత భవిష్యత్తుకు ఇంతగా ఆలోచిస్తున్న సీఎంకు రుణపడి ఉంటాం.

– గొర్రిపోటి వెంకటలక్ష్మి, విద్యార్థి తల్లి, పందలపాక ఉన్నత పాఠశాల

చాలా సంతోషంగా ఉంది



బైజూస్ ట్యాబ్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇది చదువుకోవడానికి చాలా ఉపయోగపడుతుంది. ట్యాబ్‌లో ఉండే పాఠాలు ఏ సమయంలోనైనా నేర్చుకోవొచ్చని మా ఉపాధ్యాయులు చెప్పారు.

– కొక్కిరిమెట్ల ఓం సత్య, ఎనిమిదో తరగతి విద్యార్థిని, మెళ్లూరు ఉన్నత పాఠశాల

ఎంతో మంచి నిర్ణయం



విద్యార్థులు డిజిటల్ విద్యకు దగ్గరవ్వడానికి, సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వమిస్తున్న ట్యాబ్‌లు దోహదపడతాయి. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఎంతో మంచి నిర్ణయం.

– పడాల ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, కొంకుదురు ఉన్నత పాఠశాల

కృష్ణారెడ్డికి అభినందనలు


కృష్ణారెడ్డిని అభినందిస్తున్న పందలపాక నాయకులు

బిక్కవోలు: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సబ్బెళ్ళ కృష్ణారెడ్డిని పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి తదితర నాయకులు అభినందనలు తెలియజేశారు. ఆదివారం పందలపాకకు చెందిన నాయకులంతా అనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కృష్ణారెడ్డిని కలిసి జ్ఞాపిక అందజేశారు. అభినందనలు తెలిపిన వారిలో పందలపాక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల కృష్ణారెడ్డి, యాసలపు శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్, కర్రి సతీష్, రెడ్డి చెల్లారావు తదితరులున్నారు.

నేటి నుంచి అనపర్తిలో గడప గడపకూ..

అనపర్తి: అనపర్తిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు గడపగడపకూ మన ప్రభుత్వం ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు గ్రామంలోని 1వ గ్రామ సచివాలయం పరిధిలో జరగనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

'నన్నయ' ఎగ్జామినేషన్ ఫ్యాకల్టీ అసోసియేట్‌గా అమ్మిరెడ్డి


వీసీ జగన్నాథరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మల్లిడి అమ్మిరెడ్డి

అనపర్తి: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పీజీ, డిగ్రీ కాన్ఫిడెన్షియల్ ఎగ్జామినేషన్స్ ఫ్యాకల్టీ అసోసియేట్‌గా మండలంలోని మహేంద్రవాడకు చెందిన డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి నియమితులయ్యారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎం.జగన్నాథరావు చేతుల మీదుగా అందుకున్నట్లు అమ్మిరెడ్డి ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న అమ్మిరెడ్డికి ఫ్యాకల్టీ అసోసియేట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, అక్కు ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎస్.టీకే, జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు, అక్కు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.సాంబశివరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

గ్రామీణ క్రీడలకు ముఖ్యమంత్రి ప్రోత్సాహం


క్రీడోత్సవాల సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వేదికపై శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జక్కంపూడి రాజా, గణేష్


సభలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- గాడాలలో నియోజకవర్గ స్థాయి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ ప్రారంభం
- జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 వరకూ పోటీలు
- పాల్గొన్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

మధురపూడి: గ్రామీణ క్రీడలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజానగరం నియోజకవర్గ స్థాయి జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను ఆయన ఆదివారం సాయంత్రం కోరుకొండ మండలం గాడాల గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అధ్యక్షతన నిర్వహించిన సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రాజానగరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు క్రీడాకారుల మహా సమ్మేళనంలా ఉందన్నారు. క్రీడా పోటీలు నిర్వహిస్తున్న జక్కంపూడి రాజా, గణేష్‌లను అభినందించారు. తొలుత అక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ముత్యాలనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ క్రీడోత్సవాలను అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌లకు అంకితమివ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం వాలీబాల్ క్రీడా మైదానంలోని క్రీడోత్సవాల పతాకాన్ని ముత్యాలనాయుడు ఆవిష్కరించారు.

యువత జగనన్నకు రక్షణగా ఉండాలి

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ యువ నాయకుడు జక్కంపూడి గణేశ్‌లను అభినందించారు. సంక్షేమం–అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ సీఎం జగనన్న ప్రజల మన్ననలను అందుకుంటున్నారన్నారు. అలాంటి జగనన్నకు యువత రక్షణ కవచంగా నిలవాలన్నారు. సభాధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నెల 12 వరకూ ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాజానగరం మండలంలో క్రికెట్, సీతానగరం మండలంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి కూడా ప్రసంగించారు. తొలుత ముఖ్య అతిథులను జక్కంపూడి యూత్ సభ్యులు రాజమహేంద్రవరం నుంచి బైక్ ర్యాలీగా గాడాలలోని క్రీడా మైదానానికి తీసుకొచ్చారు. ఈ పోటీల్లో నియోజకవర్గంలోని 45 గ్రామాలకు చెందిన 36 టీమ్‌లు తలపడనున్నాయి. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు జక్కంపూడి గణేష్, పేర్ని కిట్టు, రాజానగరం ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ నాయకులు బొంతా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి వేదాలే ప్రామాణికం


వేద పఠనం గావిస్తున్న వేద పండితులు

అనపర్తి: భారతీయ సనాతన ధర్మానికి వేదాలే ప్రామాణికమని, అలాంటి వేదాల పరిరక్షణ అందరి బాధ్యతని వేదపండితులు పేర్కొన్నారు. అనపర్తి ఉమారామలింగేశ్వర వేద శాస్త్ర పరిషత్ 30వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం వేదసభ నిర్వహించారు. 12 మంది వేద పండితులు సుమారు 3 గంటల పాటు వేదగోష్ఠిని నిర్వహించారు. వేద పండితులు చేసిన చతుర్వేద పారాయణ, వేదఘోషతో గ్రామం మార్మోగింది. సభలో వేదపండితులు మాట్లాడుతూ వేద మంత్రం అత్యంత శక్తివంతమైందని, వేదమంత్రం వింటే పరమేశ్వరుని అనుగ్రహంతో శుభఫలితాలు పొందొచ్చన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, వెంకటరామారెడ్డిల సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

చెన్నుపాటి ఉద్యమ స్ఫూర్తి ఆదర్శం



చెన్నుపాటి వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

బిక్కవోలు: చెన్నుపాటి ఉద్యమ స్ఫూర్తిని నేటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని బలభద్రపురం ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ఉద్యమనేత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి, సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి అరుణకుమారి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, మండల అధ్యక్షుడు సీహెచ్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి


హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళలు

బిక్కవోలు: పల్లెల్లో సంక్రాంతి శోభ వచ్చేసింది. తెలుగువాకిళ్లు రంగు రంగుల ముగ్గులు, నోరూరించే పిండి వంటలతో అతిథులకు స్వాగతం పలుకుతున్నాయి. వీధుల్లో హరిదాసులు కీర్తనలతో సందడి చేస్తున్నారు. డూడూ బసవన్న వాకిళ్ల ముందు నాట్యం చేస్తున్నాడు. సంక్రాంతికి వచ్చే అల్లుళ్ల కోసం ఇంటింటా సున్నుండలు, పోకుండలు, అరిసెలు, జంతికలు, చక్కిడాలు తదితర సంప్రదాయ పిండి వంటకాలను సిద్ధం చేస్తున్నారు. పండగకి పట్టణాల నుంచి సొంతూరికి వచ్చిన యువత, పిల్లలతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి.

మూడేళ్లలో మునగాల అభివృద్ధికి రూ.ఏడు కోట్లు

- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఖర్చు చేసింది రూ.83 లక్షలే
- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- మునగాలలో రెండో రోజు గడప గడపకూ..


మునగాలలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం మునగాల పంచాయతీ అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.ఏడు కోట్లు ఖర్చు చేసినట్టు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో రెండో రోజు ఆదివారం కూడా రాజా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మునగాల కోసం కేవలం రూ.83.03 లక్షలు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. జగనన్న ప్రభుత్వం రూ.50 లక్షల వ్యయంతో నాడు–నేడు పథకంలో మునగాల పాఠశాలను అభివృద్ధి చేయడమే గాకుండా ఆర్‌బీకే, సచివాలయం, హెల్త్ సెంటర్, మంచినీటి ట్యాంకు, సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించిందన్నారు.ఈ గ్రామంలోని శ్మశానవాటికల ఆధునీకరణ, చెరువుల అభివృద్ధి కూడా జరిగాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజాదరణను చూసి తనకు అమితానందంగా ఉందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో బీసీ పేటలోని 100 గడపలకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమ దృష్టిని తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మండపాక కోటేశ్వరరావు, గిద్దా సత్యనారాయణ, మండపాక వెంకటపతి, నాగులాపల్లి పెద వెంకన్న, నాగులాపల్లి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలి

సంక్రాంతి సంబరాల్లో
ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


హరిదాసుల వేషధారులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజా


విచిత్ర వేషధారులతో సరదాగా..

రాజానగరం: భారతీయ సంప్రదాయ కళలు కనుమరుగవుతున్న ఈ ఆధునిక కాలంలో వాటి గురించి భావి తరాలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతగానో ఉందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఈ విషయంలో భారతీయ విద్యాభవన్ (బీవీబీ) చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. నామవరంలోని బీవీబీలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల ప్రభావంతో మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పూర్తిగా మరిచిపోతున్నామన్నారు. ఈ కారణంగా విద్యార్థులకు వాటి గురించి తెలియజేసి, వాటి ఫలాలను భావి తరాలకు పదిలంగా అందించాలన్నారు. బీవీబీ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు, గంగిరెద్దు ఆటలు, తోలుబొమ్మ లాటలు, హరికథలు, బుర్ర కథలు, వంటి కళా రూపాలను ప్రదర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సంప్రదాయ పిండి వంటలను రుచి చూస్తూ, పిల్లలతో వాటి రుచుల గురించి ప్రస్తావిస్తూ, ఎమ్మెల్యే రాజా పండగ సరదాను గడిపారు.

మత్తును వీడాలంటూ కళాజాత ప్రదర్శనలు


బుర్రకథ ద్వారా మత్తు పదార్థాలతో వచ్చే అనర్థాలను వివరిస్తున్న కళాకారులు

రాజానగరం: మత్తు పదార్థాల వినియోగం జీవితాలను ఏవిధంగా నాశనం చేస్తుందో ప్రజలను చైతన్య పరుస్తూ రాజమహేంద్రవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముక్కినాడ, తోకాడ గ్రామాల్లో ఆదివారం కళాజాత ప్రదర్శన లిచ్చారు. సారా తయారీని అరికట్టడం వల్ల, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, మత్తును విడనాడండి, జీవితాలను బాగు చేసుకోండంటూ బుర్రకథ రూపంలో తెలియజేశారు. ఎక్సైజ్ పోలీసులతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా శనగ పంట

రంగంపేట: రంగంపేట మండలంలో శనగ పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. మండల పరిధిలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో రైతులు పత్తి, మినుము పంటలు సాగు చేయగా అవి ఆశించిన స్థాయిలో దిగుబడి లేక నష్టాలు మిగల్చడంతో వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీపై సుమారు 80 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేసింది.